సీఎం గారూ.. పర్యాటకం చేయరూ !

- ఎగువ 'మానేటి'లో బోటు ప్రయాణంపై ఆశలు
- ఏళ్లుగా ఎదురుచూపులు
- నేడు జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి



నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు

గంభీరావుపేట: మండలంలోని నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా మార్చుతామన్న పాలకుల హామీలు అమలు చేయడం లేదు. జలాశయంలో బోటు ప్రయాణమెప్పుడు.. అంటూ పర్యాటకులు ఎదురుచూస్తున్నారు. ప్రాజెక్టు అన్నికాలాల్లో నిండుకుండలా ఉంటుంది. అయినా మానేటిలో బోటు ఏర్పాటు కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధం చూపడం లేదు. ఎగువమానేటి అందాలు పర్యాటకులను ఎప్పటికీ కనువిందు చేయునో.. అంటూ ప్రకృతి ప్రేమికులు పెదవి విరుస్తున్నారు. పర్యాటక ప్రదేశంగా మార్చడానికి వీలున్నా.. పట్టింపు లేని కారణంగా ఆచరణలోకి రావడం లేదు. బుధవారం జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టిసారించి పర్యాటకంగా మార్చాలని కోరుతున్నారు.

- ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా మార్చాలని ఎన్నోఏళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు.
- ప్రాజెక్టు సమీపంలో ఏళ్లనాటి అతిథి గృహం ఉంది. ఈ మధ్యనే దానికి పాక్షిక మరమ్మతులు చేశారు. గృహం ఆవరణలో గార్డెన్ ఏర్పాటుకు విశాలమైన స్థలం ఉంది. కానీ ఆ ప్రదేశంలో హరితహారం కింద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. గతంలో గార్డెన్, వాటర్ ఫౌంటెన్ ఉండేది. అవి కనుమరుగయ్యాయి.
- ప్రాజెక్టు కట్టపై «అప్పర్ మానేరు» అనే అక్షరాలు సిమెంటుతో చేసి ఉన్నాయి. వాటిని పట్టించుకునే వారు కరువయ్యారు.
- అతిథిగృహం వరకు వెళ్లాలంటే మట్టి రోడ్డే ఉంది. కారు పోవడానికి ఇబ్బందిగానే ఉంటుంది. సీసీరోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

కానరాని బోట్ల జాడ

ప్రాజెక్టులో బోటింగ్ కోసం రెండేళ్ల క్రితం బోట్లు తీసుకొచ్చారు. ప్రస్తుతం ఎవరూ పట్టించుకోకపోవడంతో అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. ప్రజాప్రతినిధులు, అధికారులు కొంతకాలంగా బోటింగ్ మాటే ఎత్తడం లేదు. బోటింగ్ సౌకర్యం కల్పిస్తామన్న నాయకుల హామీలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ప్రాజెక్టులో పుష్కలంగా నీరుంది. చుట్టూ పచ్చని పొలాలు, చెట్లు ఆపై నీటిలో బోటు ప్రయాణం చేయాలనే పర్యాటకుల కోరిక కలగానే మిగిలిపోతోంది.

క్లుప్తంగా

యాసంగిలో ఆరుతడి పంటలే మేలు



మాట్లాడుతున్న డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి

సిరిసిల్ల: యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటలే మేలని కరీంనగర్ జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి రైతు వేదికలో బుధవారం రైతు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు వ్యవసాయంలో వస్తున్న అధునాతన సాంకేతిక విధానాలను అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారిని అఫ్జల్ భేగం మాట్లాడుతూ, రైతులు మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసుకుని ఆర్థికాభివృద్ధిని సాధించాలని, వరి కొయ్యలను తగలబెట్టవద్దన్నారు. కరీంనగర్ శాస్త్రవేత్త డాక్టర్ మధుకర్ రావు, యాసంగిలో ఆరుతడి పంటల సాగు, కొత్తగా విడుదలైన వంగడాల గురించి వివరించారు. జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా.ఎం .రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయ అధికారి సంజీవ్, వ్యవసాయ విస్తరణ అధికారులు సంతోష్, కరుణాకర్ పాల్గొన్నారు.

వ్యక్తిగత దూషణలు మానుకోవాలి



మాట్లాడుతున్న మధు

సిరిసిల్లటౌన్: ప్రజా సమస్యలను గాలికొదిలేసిన కాంగ్రెసోళ్లు తమపై వ్యక్తిగత దూషణలకు తెగబడటం మానుకోవాలని మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. తాను పదేళ్లు జిల్లెల్ల సర్పంచు, మండల ఫోరం అధ్యక్షుడిగా, జిల్లా అభివృద్ధి మానిటరింగ్ సభ్యుడిగా పనిచేశానని, తనపై విమర్శలు చేస్తున్న వారు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. నాయకులు మెంగని మనోహర్, కరకవేణి కుంటయ్య, కురుమ రాజయ్య, కంచర్ల రవిగౌడ్, పరుశరాములు, సికిందర్ పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి


జేఎన్టీయూకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌మీట్లో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తంగళ్లపల్లి మండలం మండేపల్లి వద్ద 20 ఎకరాల స్థలం కేటాయించిందని, ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేఎన్టీయూ కోసం తట్టెడు మట్టి కూడా పోయలేదని ఎద్దేవా చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించిన తర్వాతే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు రావాలన్నారు. నాయకులు షేక్ సికిందర్, చీమల ప్రశాంత్, సాయి, దీపక్ పాల్గొన్నారు.

రాజన్నకే శఠగోపం పెట్టిన బీఆర్ఎస్



సిరిసిల్లటౌన్: ఇచ్చిన మాటను నిలుపుకోకుండా వేములవాడ రాజన్నకే శఠగోపం పెట్టిన చరిత్ర బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ ఆరోపించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. రాజన్న ఆలయ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు ఇస్తామని మాట తప్పారని అందుకే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు ఆపార్టీని ఛీత్కరించారన్నారు. ముఖ్యమంత్రి బహిరంగ సభకు సిరిసిల్ల నుంచి పార్టీ శ్రేణులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, శ్రేయోభిలాషులు పెద్దెత్తున రావాలని కోరారు. కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, నాయకులు గడ్డం నర్సయ్య, యెల్లె లక్ష్మీనారాయణ, దేవయ్య, నేరెళ్ల శ్రీకాంత్, గౌతం, దేవరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆమె జయంతి సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కవ్వంపల్లి అనురాధ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి , పార్టీ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనంతగిరి వినయ్‌కుమార్, మాజీ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి, గుడిసె ఐలయ్య యాదవ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆనందరెడ్డి, ప్రసాద్, జమాల్, కూ నబోయిన బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిరావాలి

వేములవాడలో జరిగే సీఎం సభకు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు.

నిధులు వెనక్కి తీసుకువచ్చి పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాధవి

వేములవాడఅర్బన్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కేటాయించిన నిధులు ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ వెనక్కి తీసుకువచ్చి పెండింగ్ పనులు పూర్తి చేయాలని వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి డిమాండ్ చేశారు. మంగళవారం వేములవాడలో మాట్లాడారు. వేములవాడ పట్టణంలోని జగిత్యాల బస్టాండ్ సమీపంలో సుమారు 20 ఎకరాల స్థలంలో కొత్త బస్టాండ్ నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూసేకరణ చేపట్టి నూతన బస్టాండ్ నిర్మించాలని, భూ నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. లేకుంటే గెజిట్‌ను తొలగించి బస్టాండ్‌ను ఇతర ప్రాంతానికి తరలిస్తారా తెలియజేయాలని డిమాండ చేశారు. కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, గొలి మహేశ్, నరాల శేఖర్, సిరిగిరి చందు, కుమ్మరి శ్రీనివాస్, నీలం శేఖర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మహాసభలకు తరలిరావాలి

సిరిసిల్లటౌన్: జిల్లా కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) రెండో మహాసభ కరపత్రాలను మంగళవారం సిరిసిల్ల కార్మిక భవనంలో యూనియన్ కార్యదర్శి కడారి రాములు ఆవిష్కరించారు. ఈనెల 24న సిరిసిల్లలో జరిగే మహాసభలకు అన్ని రంగాల కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. మహాసభలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, యూనియన్ రాష్ట్ర నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు అజ్జ వేణు, కొంక విజయ్, శ్రీరాం నర్సయ్య, ఎల్లె సత్తవ్వ, పొన్నం సరోజన, గోనె అనసూయ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంతో సెరికల్చర్



మల్బరీ తోటను పరిశీలిస్తున్న అధికారులు

ముస్తాబాద్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని రైతులు సెరికల్చర్ సాగులో అధిక లాభాలు ఆర్జిస్తున్నారని ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ రాఘవేందర్ అన్నారు. మంగళవారం ముస్తాబాద్, గూడూరు, వెంకయ్యకుంటలో పట్టుపురుగుల కేంద్రాలను అధికారులు పరిశీలించారు. సెరికల్చర్ సాగులో రైతుల అవలంబిస్తున్న సాంకేతిక పరిజ్ఞానంపై సెరికల్చర్ అధికారులు సర్వే చేపట్టారు. సెంట్రల్ సిల్క్ బోర్డు బెంగళూర్ విద్యార్థి భరత్, సెరికల్చర్ అధికారి జగన్‌రావు, రైతులు ఉన్నారు.

సీఎం సభ ఏర్పాట్లు పరిశీలన

వేములవాడఅర్బన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం వేములవాడ పర్యటనకు వస్తున్న సందర్భంగా ఏర్పాట్లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజవర్గం ఇన్‌చార్జి కేకే. మహేందర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేములవాడ రాజన్న గుడి చెరువు ప్రాంగణంలో సీఎం సభాస్థలం, పార్కింగ్ స్థలం, ఆలయ ప్రాంగణంలోని ఎన్టీఆర్ గెస్ట్‌హౌస్, ఆలయ ఈవో గెస్ట్ హౌస్‌ను పరిశీలించారు. సభా ప్రాంగణం వద్ద, అలాగే దర్శనం ఇతర చోట్ల చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సలహాలు, పలు సూచనలు అందించారు. రాజన్న భక్తులకు కూడా దర్శనానికి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు ఉన్నారు.

వరికొయ్యలు కాల్చితే దిగుబడిపై ప్రభావం



వీర్నపల్లి : రైతులకు వివరిస్తున్న మండల వ్యవసాయాధికారి

రుద్రంగి: వరి కోతలు కోసిన తర్వాత వరికొయ్యలు కాల్చడంతో భూసారంపై ప్రభావం చూపి పంట దిగుబడి తగ్గుతుందని, పొలంలోనే కలియ దున్నడంతో భూసారం పెరుగుతుందని వేములవాడ ఏడీఏ రామారావు పేర్కొన్నారు. వరికొయ్యలు కాల్చితే జరిగే నష్టాలను వివరిస్తూ మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ అధికారులతో రైతులకు అవగాహన కల్పించారు.

వీర్నపల్లి: రైతులు వరికొయ్యలు కాల్చడం ద్వారా నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం లేదని వ్యవసాయ అధికారి కే.జయ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పంటచేలను సందర్శించి రైతులతో మాట్లాడారు. వరి కొయ్యలను కాల్చడం ద్వారా భూసారం కోల్పోయి దిగుబడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఫజిల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని మల్లారంలో గౌడ కులస్తులు ఎల్లమ్మ సిద్దోగం పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సామాజికవర్గం ఇంటింటా బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు మనోహర్‌రెడ్డి, హన్మాండ్లు, రవి, శ్రీకాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి



రైతులతో సమావేశమైన అధికారులు

కోనరావుపేట: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని మండల వ్యవసాయ అధికారి సందీప్ సూచించారు. రబీ సీజన్ సాగుపై వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో నిజామాబాద్‌లోని రైతు వేదికలో మంగళవారం డీలర్లు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా రశీదు తీసుకోవాలన్నారు. అనంతరం నూతన మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సందీప్‌కు డీలర్లు శుభాకాంక్షలు తెలిపారు. ఏఈవోలు రమేశ్, హేమాజీ, పద్మ, స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లకల్చరల్: వయో వృద్ధుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య కోరారు. విధుల్లో చేరిన నూతన ఆర్డీవోను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తమ సంఘం తరపున వెలువడుతున్న పిలుపు పత్రికను అందజేశారు. డాక్టర్ జనపాల శంకరయ్య, శ్రీగాద మైసయ్య, ఏనుగుల ఎల్లయ్య, కోడం నారాయణ, అంకారపు జ్ఞానోభ, రాపెల్లి ముకుందం, భాస్కర్ తదితరులు ఉన్నారు.

● అరెస్ట్ అప్రజాస్వామికం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన బెస్త నరేశ్‌ను విచారణ చేయకుండా అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని నేషనల్ అట్రాసిటీ ప్రివెన్షల్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ అన్నారు. మంగళవారం బొప్పాపూర్‌లో పర్యటించి నరేశ్ అరెస్ట్‌కు దారి తీసిన పరిస్థితులపై విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రంలో ఒక కోడిగుడ్డు విషయంలో తలెత్తిన వివాదంలో పోలీసులు ఎలాంటి విచారణ చేయకుండా అరెస్ట్ చేసి జైలుకు పంపడం జరిగిందని, బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్, మహ్మద్ సద్దాం తదితరులున్నారు.

● డిగ్రీ కళాశాల మంజూరు చేయండి

ముస్తాబాద్: సీఎం గారూ.. మండలకేంద్రానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కళాశాల సాధన కమిటీ కన్వీనర్ చింతోజు బాలయ్య విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ముస్తాబాద్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినా సాధ్యం కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులను ఆదుకునేందుకు వేములవాడ బహిరంగ సభలో సీఎం కళాశాల మంజూరు ప్రకటించాలని బాలయ్య కోరారు.

● హామీలను అమలు చేయాలి

వీర్నపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్ పేరుతో గతంలో ఎస్సీ ఎస్టీలకు డిక్లరేషన్ ప్రకటించి వారి అభ్యున్నతికి అసైన్డ్ భూములు, లావణి పట్టాలను రెగ్యులరైజేషన్ చేయానలి బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ మంగళవారం డిమాండ్ చేశాడు. అసైన్డ్ భూములను ఎన్నో ఏళ్లుగా కాస్తులో ఉంటూ సాగు చేసుకుంటున్న రైతుల భూములకు సమాన హక్కులు కల్పించి అమ్మకం, కొనుగోలుకు అవకాశం కల్పించాలని కోరారు. ఎస్సీ,ఎస్టీ కార్పొరేషన్ల జాడే లేదని,ఇప్పటికైనా హామీలను నెరవేర్చాలన్నారు.

● సీఎంను కలిసేందుకు సిద్ధమవుతున్న మాజీ ప్రజాప్రతినిధులు

వేములవాడరూరల్: ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు పలు అభివృద్ధి పనులు చేసినా ప్రభుత్వం నుంచి నిధులు రాక తమ బతుకులు అగమ్యగోచరంగా మారాయని, ఇప్పటికే మాజీ సర్పంచ్‌లు ఆందోళన చేపడుతున్నారు. వేములవాడ రాజన్న సన్నిధికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి మనసు మారాలని, నిధులు మంజూరు చేయాలని ఇప్పటికే మాజీ ప్రజాప్రతినిధులు రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. బుధవారం వేములవాడకు వస్తున్న సీఎంను కలిసేందుకు జిల్లాలోని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు వస్తున్నట్లు తెలిసింది.

● వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్-రాచర్లగొల్లపల్లి గ్రామాల సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం గంభీరావుపేట మండలకేంద్రంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, నూతన వస్త్రాలు, భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు సత్యనారాయణ, సతీశ్, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

● ఆలయానికి నిధులు కేటాయించాలి

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన నాంపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నిధులు కేటాయించాలని నాంపల్లి గ్రామస్తుడు బొల్గం నాగరాజు కోరారు. ఏటా రూ. కోటికి పైగా ఆదాయం ఉన్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి నిధులు కేటాయించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వం నాంపల్లి శివారులో భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులకు ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలనిన కోరారు.

● విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలి

ఇల్లంతకుంట : విద్యుత్ ప్రమాదాలు జరగకుండా వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. మంగళవారం ఆయన మండలకేంద్రంలోని సెస్ కార్యాలయంలో బాధిత కుటుంబాలకు పరిహా రం చెక్కులు అందజేశారు. గ్రామానికి చెందిన రంగు రమేశ్, అనంతగిరి గ్రామానికి చెందిన మహేశ్ విద్యుదాఘాతంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి రూ.5లక్షల చెక్కును అందజేశారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, ఏడీ శ్రీనివాసులు, తదితరులున్నారు.

● ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం

వేములవాడఅర్బన్: ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు తలపెట్టిన పాదయాత్ర మంగళవారం వేములవాడ చేరుకోగా ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజన్న, నాగరాజు, గౌతమ్, ఉదయ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

● డ్రాయింగ్ పోటీలు

ఇల్లంతకుంట: మండలంలోని పొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ టాయిలెట్ దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, స్వచ్ఛభారత్ మిషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రం శివారులోని వీర్నపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన పాతబావి ప్రమాదకరంగా మారింది. రహదారిని ఆనుకొని ఉన్న బావిని పూడ్చివేయాలని పలుసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రిపూట వాహనదారులు అదుపుతప్పి బావిలో పడిన సంఘటనలున్నాయి. అధికారులు బావి వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాతబావిని పూడ్చివేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
కిరణ్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, ఎల్లారెడ్డిపేట : ఫోన్‌నంబర్: 9440818864

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

మాలలు ఐక్యంగా ముందుకు సాగాలి



మాట్లాడుతున్న పిల్లి సుధాకర్

సిరిసిల్లటౌన్: మాలలను అణచివేసే కుట్రతో అమలు చేస్తున్న ఎస్సీ వర్గీకరణ పూర్తిగా అసంబద్ధమైందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ధ్వజమెత్తారు. భద్రాచలం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మంగళవారం సిరిసిల్లకు చేరింది. ఈసందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ, వ్యతిరేక శక్తులను ఎదుర్కొనేందుకు మాలలంతా ఏకమై ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే «హలో మాల..చలో హైదరాబాద్» కార్యక్రమానికి పెద్దెత్తున తరలిరావాలని కోరారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు తుంగ శివరాజు, జక్కుల యాదగిరి, మందాల శ్రీనివాస్, ఎడ్ల సందీప్, రొడ్డ రాంచంద్రం, ఎడ్ల రాజ్‌కుమార్, పాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి



సిరిసిల్ల టౌన్ : మాట్లాడుతున్న గోలి వెంకటరమణ

సిరిసిల్లటౌన్: సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడకు వస్తున్న నేపథ్యంలో సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వస్త్ర పరిశ్రమ, అనుబంధ రంగాల కార్మికులు, యజమానులు, ఆసాములు అందరూ హాజరుకావాలని కోరారు. వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, ఏనుగుల ఎల్లయ్య, ఆంకారపు రవి, గోనె ఎల్లప్ప, శంకర్, దామోదర్, బాలరాజు, సత్యం, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: సీఎం సభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్ కోరారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో మండలం నుంచి భారీగా సీఎం సభకు తరలనున్నట్లు తెలిపారు. పులి లక్ష్మీపతి, ఏనుగుల కనుకయ్య, కొడగాని వెంకటేశ్, నిమ్మ వినోద్‌రెడ్డి, ఉయ్యాల శ్రీనివాస్, గంగిపెల్లి లచ్చయ్య తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: వేములవాడలో జరిగే సీఎం బహిరంగ సభకు మూడు మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య కోరారు. ఎల్లారెడ్డిపేట పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. నాయకులు చెన్ని బాబు, గుర్రపు రాములు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: సీఎం సభకు వేలాదిగా ప్రజలు తరలిరావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మాట్లాడుతూ వేములవాడ ఆలయ అభివృద్ధితోపాటు, సిరిసిల్ల ఎస్పీ కార్యాలయాన్ని సీఎం ప్రారంభిస్తారన్నారు.

కోనరావుపేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంగళవారం మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు చేపూరి గంగాధర్, నందూ గౌడ్, వంగపెల్లి శోభన్, ప్రదీప్, శ్రీనివాస్, దేవరాజు, అజీమ్, లింబయ్య తదితరులు పాల్గొన్నారు.

బతుకుదెరువు కోసం ..



వేములవాడరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ రాజన్న ఆలయానికి నేడు రానుండగా పట్టణంలో పలువురు అభిమానులు, పార్టీ నాయకులు ఆయన ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఓ చిన్నారి మాత్రం ప్రధాన రోడ్లపై సైకిల్‌పై సవారీ చేస్తూ బతుకుదెరువు కోసం పట్టణంలో పార్టీ జెండాలను మోయడం కనిపించింది.



సిరిసిల్ల టౌన్ : ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బోయినపల్లిలో ..

ఇందిరాగాంధీకి నివాళి

సిరిసిల్ల టౌన్/బోయినపల్లి/చందుర్తి/ కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/ ముస్తాబాద్/ గంభీరావుపేట: భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని మంగళవారం సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఇందిరాగాంధీ దేశాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి శివారు బిక్కవాగు ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఇల్లంతకుంట ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న బద్దం రమేశ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.